క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆమనగల్లు: విద్యుత్ మరమత్తుల కారణంగా ఆమనగల్లు పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైఎస్ షర్మిలకు స్వాగతం



షర్మిలకు స్వాగతం పలుకుతున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం శనివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన వైఎస్ షర్మిలకు ఇబ్రహీంపట్నంకు చెందిన ఆపార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, యువ నాయకులు చందు, రాజు తదితరులు షర్మిలను ఘనంగా సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న సత్యం

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లికి చెందిన నర్సమ్మ శుక్రవారం మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులను శెట్టిపల్లి సర్పంచ్ గోదాదేవి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు సత్యం పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. స్థానికులు చంద్రమౌళి, నర్సింహ, పెద్దయ్యాచారి, బ్రహ్మాచారి, శరవయ్య, జంగయ్య, శంకరాచారి, కృష్ణాచారి, వెంకటేశ్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో అయ్యప్ప పడిపూజ



పడిపూజలో అయ్యప్ప స్వాములు

యాచారం: మండల కేంద్రంలోని ధర్మశాస్త్ర పుణ్యక్షేత్రంలో శుక్రవారం అయ్యప్పస్వామి ఇరుముడి పడిపూజ ఘనంగా జరిగింది. బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, నారాయణశెట్టి గురుస్వామి ఆధ్వర్యంలో చందర్‌నాయర్ గురుస్వామి పర్యవేక్షణలో పూజ కార్యక్రమం జరిగింది. అయ్యప్పలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన



ఎర్రకుంటలో పర్యటిస్తున్న కేఎల్లార్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంటలో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి శుక్రవారం పర్యటించారు. బుధవారం ఎర్రకుంట చౌరస్తాలో గోతులమయమైన రోడ్డు కారణంగా ఓ యువకుడు మృతి చెందిన నేపథ్యంలో ఆయన రహదారిని పరిశీలించారు. అనంతరం సమీపంలోని బస్తీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎర్రకుంటలో రోడ్డు డ్యామేజీకి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ జహంగీర్, సాదిక్ మహ్మద్, అహ్మద్ బామ్, బారీ, అబ్దుల్లా బిన్, అవద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



ఫ్యాన్లు అందజేస్తున్న మహేశ్ తదితరులు

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ఎంతో కృషి చేస్తున్నారని కుర్వగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ ప్రాథమిక పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో ఐదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు 2 ఫ్యాన్లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేష్, రామకృష్ణ, ఆనంద్, ప్రవీణ్, నవిత, గ్రామస్తులు తదతరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో కాంగ్రెస్ నాయకులు
- నేటితో ముగియనున్న గడువు



ఆమనగల్లు: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో వార్డు సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆయా వార్డు సభల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీం, నాసర్, ప్రసాద్, రఫీ, సుచ్చుగుట్టతండాలో.. కృష్ణనాయక్, లక్ష్మి ప్రజలకు దరఖాస్తులపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్, ఎంపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

898 దరఖాస్తుల స్వీకరణ

తలకొండపల్లి: మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమమం కొనసాగింది. మండల వ్యాప్తంగా శుక్రవారం 898 దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 12,365 గృహాలు ఉండగా ఇప్పటివరకు 12,343 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేదుకే..

తలకొండపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం ఆయన చీపునుంతల్లో మాట్లాడారు. అర్హులందరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

16వేలకు పైగా దరఖాస్తులు

తుర్కయంజాల్: ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు శనివారంతో గడువు ముగియనుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీలో సుమారు 16వేలకు పైగా దరఖాస్తులు అందాయని అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితో వెంకటరమణారెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు

ఇబ్రహీంపట్నం: 13 నెలల పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా విద్యావ్యవస్థకు సేవ చేసే అవకాశం కల్పించిన వారందరికీ ఆ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు. శుక్రవారం రాష్ట్రంలోని గ్రంథాలయ సంస్థల చైర్మన్లను తొలగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తనకు సహకరించి ఈ పదవి ఇచ్చారని.. వారి ఆశలు వమ్ము చేయకుండా జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషిచేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి చేయూత



సిమెంట్, స్టీల్ పంపిణీ చేసిన ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: నిరుపేదల ఇంటి నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన యాదయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే ఉండటంతో డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశాడు. విషయం తెలుసుకున్న ఉప్పల వెంకటేశ్.. యాదయ్య ఇంటి నిర్మాణానికి ఆర్థికసహాయం అందజేస్తానని భరోసా పలికారు. తక్షణ సహాయంగా యాదయ్య ఇంటి నిర్మాణానికి శుక్రవారం ట్రస్టు సభ్యుల చేత సిమెంట్, స్టీల్, తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్, వెంకటేశ్, శ్రీశైలం, యాదయ్య, హరీష్, జంగయ్య, చిన్నయ్య, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు గడువు పెంచండి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల గడువును పెంచాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాములుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సరూర్‌నగర్‌లోని ఎల్‌బీనగర్ పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేదలు సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అర్హులుగా ఉన్నారని, వీరంతా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునేందుకు మరింత గడువు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా రేషన్‌కార్డులు లేకున్నా అర్హులకు ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివలింగం, మల్లేశ్ యాదవ్, నాయకులు రాజు స్వామి, సిద్ధు, భీమ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో శుక్రవారం ఆయన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి చూపడం మంచి పరిణామమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపాలచారి, ఎంపీటీసీ మంగమ్మ, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు నవీన్ రెడ్డి, బాబురావు, గౌస్, శేఖర్, శివ, కుమార్ పాల్గొన్నారు.

సమాజ సేవలో ముందుండాలి



దొంతాన్‌పల్లి పాఠశాల విద్యార్థులతో ఇక్ఫాయి కళాశాల విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇక్ఫాయి బిజినెస్ స్కూల్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ గణేశ్ ఆకాంక్షించారు. ఇక్ఫాయి కళాశాల బిజినెస్ స్కూల్ ఎంబీఏ విద్యార్థులు, సంకల్ప్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని దొంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను రంగులతో అలంకరించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గణేశ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతలు, విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొంతాన్‌పల్లి సర్పంచ్ అశ్విని, ఇక్ఫాయి బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, ప్రొఫెసర్‌లు మాధవి, సింధుజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవిశ్వాసాలపై తొందరొద్దు

కాంగ్రెస్ సీనియర్ నేత శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం: పురపాలిక చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అధికార పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసాలు పెట్టొద్దని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆదిబట్ల మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసాలు పెట్టాలని ప్రతిపాదించడం వలన కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం కలుగుతుందన్నారు. పార్టీకి నష్టం కలుగుతుందని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ అవిశ్వాసాలు పెట్టకుండా అడ్డుపడిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఎంతో కష్టపడిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ అవిశ్వాసాలకు బ్రేక్ వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సంప్రదించకుండా ఎలాంటి ఆలోచనలు కాంగ్రెస్ కౌన్సిలర్లు చేయవద్దని సూచించారు.

పాత కార్యవర్గాలు రద్దు

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ డివిజన్ల కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులను సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌ల ఆదేశాల మేరకు తక్షణమే రద్దు చేస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాలను పూర్తిగా రద్దు చేస్తున్నామని తెలిపారు. త్వరలో నూతన కార్యవర్గాలను నియమిస్తామని ఆయన తెలిపారు.

పుట్టినరోజున అన్న సంతర్పణ

హుడాకాంప్లెక్స్: హైకోర్టు న్యాయవాది గాజుల మహాలక్ష్మి దయాశంకర్ దంపతుల కుమారుడు భువనతేజ సరూర్‌నగర్‌లోని ఆదరణ అనాథ ఆశ్రమంలో శుక్రవారం పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ జే.మాధవరావు మాట్లాడుతూ.. స్నేహితుల సమక్షంలో హోటళ్లలో పుట్టినరోజు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఈ రోజుల్లో భువనతేజ పుట్టినరోజు వేడుకను తల్లిదండ్రులు అనాథ ఆశ్రమంలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు.

నాటిన ప్రతి మొక్కనూ సంరక్షిద్దాం

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: హరితాహారంలో భాగంగా మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలను సిద్ధం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నర్సరీలో 11వేల మొక్కలను పెంచేందుకు గాను సంబంధిత అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, కార్మికులతో కలసి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేశారు. ఇందులో భాగంగా నర్సరీలో జామ, ఉసిరి, కానుగ, గులాబీ, తులసీ, మందార, కరివేపాకు, వేప నీలగిరి తదితర మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. గ్రామంలోని నర్సరీని శుక్రవారం సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పరిశీలించి సిబ్బందికి మొక్కల పెంపకంపై పలు సలహాలు ఇచ్చారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాల్లో గ్రామ పంచాయతీ పరిధిలో 80వేల మొక్కలను నాటడం జరిగిందని.. నాటిన ప్రతి మొక్కను పూర్తిస్థాయిలో సంరక్షించామని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలను తొలగించే వారిపై పంచాయతీ రాజ్ చట్టం-2018ను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాఘవేందర్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

సర్పంచ్ మంజుల



రేషన్ షాపును ప్రారంభిస్తున్న సర్పంచ్ మంజుల

ఆమనగల్లు: రేషన్ షాపుల ద్వారా సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని చింతలపల్లి సర్పంచ్ కొప్పు మంజుల సూచించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లిలోని రేషన్‌షాపు డీలర్‌గా ప్రభుత్వం ఇటీవల కొప్పు అశోక్‌ను నియమించింది. చింతలపల్లిలో శుక్రవారం కొప్పు అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేషన్‌షాపును శుక్రవారం సర్పంచ్ కొప్పు మంజుల ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు నెలనెలా సక్రమంగా సరుకులు అందించాలని కోరారు. ప్రభుత్వం సూచించిన విధంగా ప్రజలకు అందుబాటులో ఉండి సరుకులు పంపిణీ చేయాలని కోరారు. సమయపాలన పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యాదయ్య, వెంకట్‌రెడ్డి, శంకర్, భగవాన్‌రెడ్డి, రమేశ్, మహేశ్, శంకర్, లక్ష్మయ్య, బాలయ్య, కృష్ణయ్య, పర్వతాలు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భవనం స్వాధీనం

అర్చకుల గదిలో తిష్టవేసిన వ్యక్తిని ఖాళీ చేయించిన అధికారులు



గదికి సీల్ వేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణ భవనంలో అక్రమంగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తిని గ్రామస్తుల సహకారంతో దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం ఖాళీ చేయించారు. తనకు తానే స్వామీజీగా చెప్పకుంటున్న స్థానికేతరుడైన వ్యక్తి కొన్నాళ్లుగా దేవాలయం పక్కన ఉన్న పూజారులకు కేటాయించిన ఇంట్లో ఉంటున్నాడు. ఆలయ అర్చకులు ఉండేందుకు నివాస భవనం లేకపోవడంతో వారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లిలో అద్దెకు నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని గమనించిన దేవాదాయ అధికారులు పలుమార్లు అతన్ని ఇల్లు ఖాళీ చేయాలని సూచించారు. అయినప్పటికీ అతడు వినకపోవడంతో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈవో మురళీకృష్ణలు పాలక మండలి చైర్మన్ వెంకటేష్, సభ్యులు పద్మశంకర్ గౌడ్, కృష్ణ, సహదేవ్, అశోక్ ముదిరాజ్, పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ సభ్యులు సురేష్, శ్రీకాంత్, విఘ్నేష్, మహేందర్ గౌడ్‌లు, గ్రామ భక్తుల పర్యవేక్షణలో సదరు వ్యక్తికి సంబంధించిన సామగ్రిని తొలగించారు. అనంతరం అధికారులు ఆ ఇంటికి తాళం వేసి సీల్ వేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున రావడంతో విషయం తెలుసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

చేవెళ్ల: అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన శ్రీరాముడి అక్షింతలకు శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో, కౌకుంట్ల మడికట్లు, ఊరేళ్ల తదితర గ్రామాల్లో తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అక్షింతలు తీసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు సూచించారు. చేవెళ్లలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామంలోని హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఐదు శతాబ్దాల నిరీక్షణ తర్వాత అయోధ్య రామాలయ ప్రతిష్ఠ జనవరి 22న జరుగుతుందన్నారు.

అక్షింతల పంపిణీ

షాబాద్: అయోధ్య రామ మందిర అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని లక్ష్మరావుగూడ గ్రామంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్, కిష్టయ్య, కుమార్, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, బోజిరెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

మరమ్మతులు చేపట్టరూ..



ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ నుంచి మీర్‌పేటకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



సాయివిహార్‌నగర్ కాలనీలో శిథిలాలను ఇళ్ల ముందే వదిలేసిన వైనం

- గుంతలమయంగా కాలనీల రోడ్లు
- పనుల పేరిట తవ్విన రహదారులు
- తూతుమంత్రంగా గుత్తేదారుల చర్యలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మీర్‌పేట: అభివృద్ధి పనుల పేరుతో రోడ్లను యథేచ్ఛగా తవ్వేయడం.. ఆపై మరమ్మతులు చేయకుండా వదిలేయడం.. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో షరా మామూలైంది. కాసులు దండుకోవడానికే అధిక ప్రాధాన్యం ఇచ్చే గుత్తేదారులు తూతుమంత్రంగా పనులు చేపట్టి మమా అనిపిస్తున్నారు. ఫలితంగా ఆయా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణాకు అనుకూలమైన రహదారులు సైతం పైపులైను పేరుతో ఛిద్రం చేసి స్థానికులను అవస్థలకు గురిచేస్తున్నారు. అభివృద్ధి అంటే ఉన్న మంచి పనిని తొలగించి మరలా నిర్మించడం లాంటి అలవిమాలిన చర్యలు కాకుండా పకడ్బందీ కార్యాచరణతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను తీర్చాలి.

డ్రైనేజీ ఏర్పాటుకు..

పలు కాలనీలలో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ పనుల నిమిత్తం అంతర్గత రహదారులను తవ్వి పనులు పూర్తయ్యాక మరమ్మతులు చేపట్టకుండా కాంట్రాక్టర్ మట్టితో పూడ్చి చేతులు దులుపుకొంటున్నారు. అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్లను అడ్డగోలుగా తవ్వడంతో ధ్వంసమై గుంతలమయంగా మారాయి. అంతర్గత రహదారులను తవ్వన తరువాత పనులు చేసిన సదరు కాంట్రాక్టరే తిరిగి రోడ్డుకు మరమ్మతులు చేయాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే కాలనీల దారులన్నీ అధ్వానంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఎస్ఎల్ఎన్ఎస్, సాయివిహార్‌నగర్ తదితర కాలనీల్లో రహదారులు సరిగా లేక వాహనాదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

ప్రయాణం నరకం..

ముఖ్యంగా రోడ్ల తవ్వకాలతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి రావడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తమైన రహదారుల గుండా ప్రయాణం చేయడానికి నరక యాతన పడుతున్నారు. కొన్నిచోట్ల ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేగాకుండా రోడ్డు శిథిలాలను కూడా తొలగించకుండా ఇళ్ల ముందే ఉంచారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధి పనుల నిమిత్తం తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

దుమ్ముతో అవస్థలు పడుతున్నాం



దాదాపు నెలన్నర రోజుల క్రితం పైపులైన్ కోసం రోడ్డును తవ్వారు. మంచిగా ఉన్న రోడ్డును తవ్వి మరమ్మతులు చేయకపోవడంతో ధ్వంసమైంది. దీంతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి వస్తోంది. వీలైనంత త్వరగా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.

– జిల్లెల నలేశ్వరం, డైమండ్‌కాలనీ, మీర్‌పేట